ప్రజాశక్తి
శుక్రవారం 13 అక్టోబర్ 2023 5
పార్వతీపురం మన్యం



అనారోగ్యంతో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం
మండలంలోని కుమ్మరిగుంటకు చెందిన లింగబోతు గౌరీశ్వరి (17) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. గౌరీశ్వరికి ఈనెల 7న జ్వరం వచ్చినట్లు తల్లిదండ్రులకు తెలియజేయడంతో గ్రామంలో ఉన్న ప్రైవేట్ ప్రాక్టీషనర్ సహాయంతో పాలకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకువెళ్లారు. వైద్యం పొందుతున్నప్పటికీ రక్తం తక్కువగా ఉండడంతో పాటు రక్త స్రావం కావడంతో స్పృహకోల్పోయి మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. గౌరీశ్వరి పాలకొండలోని తమ్మినాయుడు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది.

గౌరీశ్వరి

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, బెలగాం
విద్యలో అవకాశాలు అందిపుచ్చుకోవాలని రాష్ట్ర గిరిజన తెగల (ఎస్టీ) కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. జిల్లా పర్యటనకు గురువారం విచ్చేసిన ఆయన పార్వతీపురంలో జోగింపేట కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం మండలంలో పర్యటించారు. కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించిన కమిషన్ చైర్మన్ విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. వైద్యం, ఇంజినీరింగ్, శాస్త్ర సాంకేతిక రంగాలు, సోషల్ సైన్సెస్ తదితర రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న రంగాలను ఎంపిక చేసుకొని వాటిలో నైపుణ్యాలు సాధించాలని అప్పుడే ప్రపంచం మీ సొంతమవుతుందని చెప్పారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆశ్రమ పాఠశాలలో సదుపాయాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి ఉత్తమ విద్యార్థిగా పోటీ పరీక్షల పోటీకనుగుణంగా మారాలని, అందుకు ఉపాధ్యాయులు ఉత్తమ శిక్షణ నడుం బిగించాలని ఆయన అన్నారు. విదేశీ విద్యను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకునేవిధంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

గిరిజన సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం మండలంలోని వివిధ పాఠశాలలను కమిషన్ చైర్మన్ సందర్శించారు. గిరిజనులు, వివిధ సంఘాల నుంచి అర్జీలను స్వీకరించారు. గిరిజనులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిపిఐ వినతి అందజేసింది. మండలంలో 350 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, తిత్తిరి పంచాయతీ పరిధిలో ఏనుగుల సంచారం, గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులను, తిండి గింజలను ధ్వంసం చేస్తూ, రాత్రిళ్ళు గిరిజన గూడెంలోకి వచ్చి దాడి చేయడంతో గిరిజనులు భయపడుతున్నారని, ఏనుగులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేసిన ఎస్టీ కమిషన్ చైర్మన్

స్వతహాగా వైద్యులు అయిన చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు చెముడుగూడలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందించారు. అనంతరం కస్తుర్బాగూడలో నవర భాష పాఠశాలను తనిఖీ చేశారు. గుమ్మలక్ష్మీపురం మండల పరిషత్ కార్యాలయంలో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, అయితే స్వయంగా పర్యటించడం వల్ల మరికొన్ని సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ప్రభుత్వం దృష్టిలో పెడతామని అన్నారు. నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయని, ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుందని ఆయన చెప్పారు. ఏనుగుల సమస్యపైన, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు పట్ల ప్రభుత్వం దష్టికి తీసుకువెళతామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి కమిషన్ చైర్మన్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి కె శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

చెముడుగూడ జెఎస్ శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న శంకరరావు

రూ.550 కోట్లతో గృహ నిర్మాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో ప్రారంభించగా, జిల్లాస్థాయిలో పార్వతీపురం మండలం కృష్ణపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ నిశాంత్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్య అతిథిలుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల విలువ రూ.488కోట్లు కాగా, సిమెంట్, ఇనుము సబ్సిడీ ధరకు ఇవ్వడం వల్ల రూ.550కోట్లు వెచ్చిస్తూ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారుల కృషితో రాష్ట్రస్థాయిలో జిల్లా నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఇంకా పునాదులు, ఆపై స్థాయిలో ఉండే గృహాలు ఉన్నాయని, వాటిని కూడా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ఈ గ్రామంలో ఇళ్ల పట్టాలు కావాల్సిన వారు ఇంకా ఉన్నారని ఎంఎల్ఎ తెలిపారని, వారందరికీ ఖాళీలు చూసి 90 రోజుల్లోగా భర్తీ చేసి పట్టాలు ఇవ్వాలని ఆర్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. ఈ కాలనీలో ఇంకా ఎవరికైనా ఇంటి స్థలాలు అవసరమైతే రెండు వారాల్లోగా మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మంచినీటి సరఫరా కోసం బిసి కాలనీలో 150 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆ పనులు పూర్తిచేయిస్తామని అన్నారు. ఐటిడిఎ పరిధిలోని మండలాలకు రూ.1.20కోట్లు, ఇతర అర్బన్ మండలాలకు రూ.60 లక్షలు చొప్పున నరేగా నిధులు మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. జిజిఎంపీ కింద మరో రూ.20 లక్షలు మంజూరు కానున్నట్లు తెలిపారు. కాలనీలోని సిసి రోడ్లకు మంజూరు ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.90 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే చెప్పారని, వాటికి టెండర్లు పిలిచి రానున్న 3 మాసాల్లోగా పనులు పూర్తిచేయాలని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులను ఆదేశించారు. మరో మూడు మాసాల్లో ఇచ్చిన హామీలన్ని పూర్తికావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ కృష్ణపల్లిలో 4.80 ఎకరాల్లో 124 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇంకా అర్హులుంటే ఖాళీ స్థలాల్లో వారికి మంజూరుచేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి సామూహిక గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఆర్‌డిఒ కె.హేమలత, టిడ్కో చైర్‌పర్సన్ ప్రసన్నకుమార్, గృహ నిర్మాణ సంస్థ బోర్డు డైరెక్టర్ భోగిలత, పథక సంచాలకులు టి.రమేష్, బలిజిపేట, సీతానగరం ఎంపిపిలు గుడివాడ నాగమణి, బలగ రమణమ్మ, ఎఎంసి చైర్మన్ మరడాన భాగ్యశ్రీ, మునిసిపల్ వైస్‌ఛైర్మన్లు ఇందుపూరు గున్నేష్, కొండపల్లి రుక్మిణి, వైస్ ఎంపిపి బి.రవికుమార్, జెడ్‌పిటిసిలు రేవతమ్మ, రవికుమార్, బాబ్జీ, కృష్ణపల్లి ఉప సర్పంచ్ లంక శ్రీదేవి, గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపల్లిలో సామూహిక గృహ ప్రవేశం ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌ఇ గణపతిరావు

త్వరితగతిన అభివృద్ధి పనులు

ప్రజారోగ్య శాఖ ఎస్ఇ గణపతిరావు

ప్రజాశక్తి -సాలూరు
మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజారోగ్య శాఖ ఎస్ఇ పి.గణపతిరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన పట్టణంలోని వైటిసి వద్ద నిర్మాణంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌ను, రామాకాలనీలో నిర్మించనున్న పార్క్‌ను ఆయన పరిశీలించారు. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.19లక్షలతో టెండర్లు పిలవాలని ఆదేశించారు. రామాకాలనీలో రూ.50లక్షలతో అభివృద్ధి చేయనున్న పార్క్ పనులకు వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ, తాగునీటి విద్యుత్ సరఫరా సౌకర్యాలకు సంబంధించిన పనులను రూ.8కోట్లతో చేపట్టనున్నట్లు తెలిపారు. వీటికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. అనంతరం వార్డు అమెనిటీస్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రజారోగ్య శాఖ ఇఇ జి.శ్రీరామమూర్తి, టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణికుమార్, ఇంఛార్జి డిఇ సూరి నాయుడు, వర్క్ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వున్నారు.

అటవీ భూసర్వేకు సహకరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి -గరుగుబిల్లి
మండలంలో గొట్టివలస రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 279 గల అటవీశాఖ భూమిని సర్వే చేసేందుకు రైతులు సహకరించాలని ఆర్‌డిఒ హేమలత అన్నారు. ఆ భూమిని అటవీశాఖ కు కేటాయించినందున సర్వే చేయడాన్ని రైతులు వ్యతిరేకించడం సరికాదని అన్నారు. గురువారం రైతులతో తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాధిత రైతులు ఆదివారం లోపు అటవీ శాఖకు కేటాయించిన భూమిపై సర్వే డిపార్టుమెంట్ ఆఫ్ ఫారెస్ట్, రెవిన్యూ, ఉద్యానశాఖ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులు తమ భూమిని చూపించి సర్వే చేయించుకోవాలని. సర్వే అన్నది చేయించకపోతే ఈ అటవీ శాఖకు సంబంధించిన భూములపై రైతులు లేరని చెప్పి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. డి-పట్టా కలిగిన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, నష్టపరిహారాన్ని గాని, వేరొక చోట భూమిని ఇవ్వడం గానీ జరుగుతుందని అన్నారు. ఆక్రమణదారులు ఎవరైనా ఉంటే తప్పకుండా ఆక్రమణ భూమి విడిచిపెట్టాలని తెలిపారు.

చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షించడం తప్పదు

ఈ కొండపై ఏర్పాటు చేసుకున్న క్రైస్తవులు ఎవరి మనోభావాలను దెబ్బతీసే విధంగా చర్యలు చేపడితే వారిపై తప్పకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి కెవి కృష్ణారావు అన్నారు. మతపరంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహాలను ఆదివారం లోపు తీసివేయాలని తెలిపారు. అందుకు రెవిన్యూ డిపార్ట్మెంట్ సహకరించాలని సిఐ సిహెచ్ ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఇంఛార్జి తహశీల్దార్ పిఎస్ఎల్. కుమార్, ఎస్ఐలు ఎం రాజేష్, కళాధర్, అనీష్ అలాగే రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్
హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తో పాటుగా రూ.500 జరిమానా న్యాయస్థానం విధించినట్లు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పాచిపెంట పోలీసు స్టేషన్ పరిధిలో పాచిపెంట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కొర్రా మూగయ్యకు చిల్లంగి ఉందనే నెపంతో అతన్ని కర్రతో కొట్టడంవలన తీవ్ర రక్త స్రావమై మతి చెందాడని తెలిపారు. ఈ విషయమై అతని భార్య కొర్రా గుర్రమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు విచారణచేసి నిందితులు కొర్ర చిన్నారావు, వంతల పొట్టయ్యను అరెస్టుచేశామన్నారు. నేరం రుజువు కావడంతో నిందితులకు శిక్ష విధిస్తూ రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదర్ రావు తీర్పు చెప్పారని తెలిపారు.

జాతీయస్థాయి పరుగు పందెంలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం
నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 10 కిలోమీటర్ల పరుగు పందెంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి రమేష్ ప్రథమ స్థానం పొందాడు. ఈ మేరకు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి శ్రీ వరం మాట్లాడుతూ, ఈనెల 8న గోవా రాష్ట్రంలో నిర్వహించిన జాతీయస్థాయి 10 కిలోమీటర్ల పరుగు పందెంలో తమ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థి రమేష్ మొదట స్థానంలో పొందడం గర్వంగా ఉందని అన్నారు. రమేష్ రాష్ట్రస్థాయిలో మూడవ బహుమతి పొందగా, జాతీయస్థాయిలో కేవలం 56 నిమిషాల 31 సెకండ్లలో మొదటి స్థానం పొంది ప్రథమ స్థానం సంపాదించి పథకంతో పాటు 50 వేల రూపాయల నగదును అందుకున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి పరుగు పందానికి ఎంపికైన రమేష్

కంబర పరిసరాల్లో పులి సంచారం

వీరఘట్టం : మండలంలోని కంబర గ్రామ పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గురువారం ఆ గ్రామానికి చేరుకుని పాద ముద్రలను గుర్తించి పులి పాదముద్రలని నిర్ధారించడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇటీవలే కంబరతో పాటు దశమంతపురం, నర్సిపురం, నడిమికెల్ల గ్రామాల్లో పులి సంచరిస్తుండడంతో ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. మళ్లీ పులి సంచరిస్తుందని వార్త వినడంతో ఒక్కసారి వీరఘట్టం మండలం అవాక్కైంది. ఇది ఇలా ఉండగా జిల్లాలో ఏనుగుల సంచారంతో పంటలు నష్టపోవడంతో పాటు ప్రజల్లో కూడా ఒక భయం నెలకొంది. పంటలు ధ్వంసం చేయడమే కాకుండా తమ ప్రాణాలకు కూడా ముప్పుందని, భయంతో కాలం వెళ్లదీస్తున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఒకవైపు పులి, మరోవైపు ఏనుగులో సంచారంతో జిల్లా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వన్యప్రాణాల నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం
ఏనుగుల వల్ల పంటలు, ఇళ్లు నష్టపోయిన గిరిజనులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులతో కలిసి తిత్తిరి ముత్రినాయుడుగూడ, బొడ్డుమానుగూడ, గుమ్మడిగూడ, నేరడిమానుగూడ, జీడిగూడ, కమలగూడ, ఇప్పలమానుగూడ, గుండాం, డి.గుండం గ్రామాలను పర్యటించి ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను, ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఏనుగులు గిరిజన గ్రామాల్లో తిష్ట వేసి పంటలను ధ్వంసం చేస్తూ ఇళ్లను కూలదోస్తూ విధ్వంసం సృష్టిస్తుంటే అధికారులు ఒక్కసారి కూడా పర్యటించి, పంట నష్టాలను పరిశీలించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గంటె, రాగులు, వరి, అల్లం, పసుపు పంటలను మొత్తం ధ్వంసం చేశాయన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చి పంట నష్టాలు ధ్రువీకరించి ఒక్కో ఎకరానికి రూ.25వేలు చొప్పున పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎం.నాగేశ్వరరావు, తెంబు, తిరుపతిరావు, సారంగో తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అంగన్వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సీతంపేట : శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, సారవకోట ప్రాజెక్ట్‌ల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, హెల్పర్, మినీ అంగన్వాడీ వర్కర్ ఉద్యోగాలకు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాతపట్నం ప్రాజెక్ట్‌లో 8 ఖాళీలు, సారవకోట ప్రాజెక్ట్‌లో ఒకటి ఖాళీ ఉద్యోగాలకు 23 దరఖాస్తులు వచ్చాయి. వీరికి ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ డిఎం హెచ్ఒ డాక్టర్ ప్రసాదరావు, పాతపట్నం సిడిపిఒ విమలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్
స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరుగుతుందని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒకప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, కావున కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

వార్షిక తనిఖీ నిర్వహించిన డిఇఒ

ప్రజాశక్తి - మక్కువ
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ వార్షిక తనిఖీ నిర్వహించారు. గురువారం పాఠ్యాంశాల నిపుణుల బృందంతో కలిసి ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపడుతున్న పలు అంశాలను ప్రధానోపాధ్యాయురాలతో చర్చించారు. కార్యక్రమంలో మండల ఎంఇఒలు పి.సత్యనారాయణ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు

ప్రజాశక్తి - భామిని
ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరి సరికాదని, ఇంత వరకు ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం సరికాదని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆరిక భాస్కరరావు అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మండల కౌన్సిల్ సమావేశం మండల అధ్యక్షులు ఈగల తిరుపతి రావు అధ్యక్షతన మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ యాప్‌లతో ఉపాధ్యాయులకు తలకుమించి భారమైందని, తద్వారా బోధనపై దృష్టి పెట్టలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేయకపోగా, బలవంతంగా జిపిఎస్ విధానాన్ని తీసుకు రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు తెలిపారు. సెప్టెంబరు నెల జీతంతో డిఎ ఇస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి హామీకే విలువలేకుండా పోయిందని జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు అన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను మండల ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్, ఆర్థిక నివేదికను కోశాధికారి బి.మహేష్, ఆడిట్ నివేదికను టి.గణపతి ప్రవేశ పెట్టారు. అనంతరం మండలం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు ఎన్నికల అధికారిగా, జిల్లా గౌరవ అధ్యక్షులు అరిక భాస్కరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. మండల అధ్యక్షులుగా ఈగల తిరుపతిరావు, ప్రధానకార్యదర్శిగా కె.ప్రసాద్, గౌరవ అధ్యక్షులు బి.చిన్నారావు, సహాధ్యక్షులుగా పి.తిరుపతి రావు, టి.సుధారాణి, కోశాధికారిగా బి.మహేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మురళీధర్, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.నాగరాజు, కార్యదర్శులుగా ఆర్.జ్యోతి, టి.సుందరమ్మ, బాలాదుర్గాప్రసాద్, ఎల్.సత్యనారాయణ, టి.గురునాధరావు, బి.అప్పలనాయుడు, ఎల్.గణేష్, కె.వెంకటరమణ, పి.రాజశేఖర్ ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా సిహెచ్.మార్కో, పి.లుడతాచిన్, కె.క్రాంతికుమార్, శివ్వాల చంద్రశేఖర్, టి.సరోజనమ్మను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భాస్కరరావు

వీరఘట్టం నూతన కార్యవర్గం ఎన్నిక

వీరఘట్టం : స్థానిక రెగ్యులర్ పాఠశాలలో గురువారం ఎన్నికల పరిశీలకులు ఎన్నికల అధికారి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడ్రాజు ఆధ్వర్యంలో మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు ఎ.స్వామిబాబు, అధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్, కార్యదర్శి కె.గోవిందరావు, సహాధ్యక్షులు జెవి సూర్యప్రకాష్, కోశాధికారి బి .వాసుదేవరావు, సహాధ్యక్షులు ఎస్.విశాలాక్షిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కౌన్సిలర్లుగా ఎస్.సతీష్, వి.రవికుమార్, వి.శ్రీధర్, ఎ.చంద్రమోహన్ నాగరాజు, బి.రాజేశ్వరి, వై.రాజు, వి.అన్నాజీరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు మండల కార్యదర్శులు వి.వీర్రాజు, ఎస్ కాంతారావు, బి రాజేష్, కె.గోవిందరావు, సింహాచలం, ఎం.రవికుమార్, వి.ప్రసాద్, వి.రాంబాబుల ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష ,కార్యదర్శి బి దుర్గాప్రసాద్ కె గోవిందరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో తండాలు

- గిరి పుత్రులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని పాలకులు
- గిరిజన గ్రామాల దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం
దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పైబడినా నేటికీ అనేక గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరానున్నాయంటే పాలకుల పనితీరు ఏ విధంగా ఉందో వీటిని చూస్తేనే అర్థం చేసుకోవచ్చును. మండలంలోని కాగితాడ, ఎలీషాపురం, సంధిమానుగూడ, గదబవలస, బట్టిగూడ, రామాపురం, బల్లగుడ్డి, నీలంపేట, తదితర గిరిజన తండాల రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గిరి పుత్రులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుకుంటున్నారు. మండలంలోని హుస్సేనాపురం 7వ బ్రాంచ్ నుండి ఈ గ్రామం మీదుగా నీలం పేట, ఎలిషా పురం, సంధిమాను గూడ వరకు 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలో రూ 4.65 కోట్లతో బిటి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులకు బ్రేకులు పడ్డాయి. ఇప్పటికే ఈ రహదారికి 40ఎంఎం చిప్స్ వేసి రోలింగ్ చేయడంతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడికక్కడ రాళ్ల పిక్కలు పైకి తేలిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గిరి పుత్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులు అధ్వానంగా ఉండడంవల్ల 104, 108 వాహనాలు వచ్చేందుకు వీల్లేక గర్భిణీలు, అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

మూతపడ్డ పాఠశాలలు

మండలంలోని వంకాయలగెడ్డ, గదబవలస, గాదిలంక, సింధునగర్‌లో పాఠశాలలు మూతపడడంతో గిరిజన విద్యార్థులు కిలోమీటర్లు పైబడి ఉన్న గ్రామాలకు వెళ్లి విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం నీలంపేట గ్రామ విద్యార్థులు హుస్సేన్ పురంలో ఉన్న పాఠశాలకు, కాగితాడ విద్యార్థులు కంబర గ్రామపాఠశాలకు, గదబవలస గిరిజనులు కత్తులకవిటి పాఠశాలకు, వంకాయలగెడ్డ విద్యార్థులు ఎం.రాజపురం పాఠశాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. వర్షాలు పడినట్లయితే రహదారులు చిందర వందరంగా తయారవడంతో ఆరోజు విద్యార్థులు పాఠశాలకు స్వస్తి పలకవలసిందే. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు హామీలు తప్ప విద్యను అభివృద్ధి చేసే దాఖలా ఎక్కడా కానరావడంలేదని గిరిజనులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాళ్లు తేలిన నీలంపేట గిరిజన గ్రామ రహదారి


కిశోర్‌చంద్రదేవ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి శత్రుచర్ల

కిశోర్‌కు శత్రుచర్ల పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర సోదరి కుసుమాంజలీ దేవి ఇటీవల చెన్నైలో అకస్మాత్తుగా గుండె పోటుతో మృతి చెందిన సంఘటన తెలుసుకొని శత్రుచర్ల విజయరామరాజు గురువారం కురుపాంలో కిషోర్ దేవ్ కోట వద్దకు వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి, సీనియర్ నాయకులు డొంకాడ రామకృష్ణ, కోలా రంజిత్ కుమార్, మర్రాపు పురుషోత్తమ నాయుడు, నందివాడ కృష్ణబాబు, పల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పాలకొండ

దసరా ఉత్సవాలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని డిఎస్పీ జివి కృష్ణారావు అన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు గురువారం పరిశీలించారు. ఈనెల 15 నుంచి 24 వరకు జరగబోయే కోట దుర్గ దసరా ఉత్సవాలకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాహనాలు వేరే మార్గంలో తరలించాలన్నారు. వాహనాలు పార్కింగ్‌కు కూడా స్థలాలు గుర్తించాలని కోరారు. డిఎస్‌పి వెంట సిఐ కె.మురళీధర్, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, బత్తిలి ఎస్‌ఐలు శివ ప్రసాద్, వెంకట రమణ, నీలకంఠరావు, అమ్మన్నరావు ఉన్నారు.

జాడలేని ఉద్యానశాఖ అధికారులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఉద్యాన అధికారుల జాడ కనిపించడం లేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. జీడిమొక్కులు వేసిన రైతులకు సూచన, సలహాలు అందజేసేలా అధికారులు కృషి చేయాలని కోరుతూ గురువారం స్థానిక తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి మొక్కలకు ఎటువంటి మందులు వేయాలి, పంటల దిగుబడికి సంరక్ష చర్యలు ఏం తీసుకోవాలోనని రైతులు ఎదురుచూసే పరిస్థితి ఉందన్నారు. మొక్కలు ఇప్పుడే చిగురు లేక బొడుపులుగా తయారై ఆకులు రాయిపోయే పరిస్థితి ఉందన్నారు. ఇంత జరుగుతున్నా ఉద్యానశాఖ అధికారుల జాడలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడి మొక్కలను పరిశీలించి, సలహా ఇచ్చి, ఐటిడిఎ ద్వారా ఉచితంగా వచ్చే ఎరువులు, క్రిమిసంహారక మందులను రైతులకు అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాము, లక్ష్మణరావు, పకీరు, సీతయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి వర్ధంతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మాజీ ఎమ్మెల్యే యర్రా కృష్ణమూర్తి 27వ వర్ధంతి మండలంలోని కృష్ణపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయచంద్రతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు దొగ్గ మోహన్, బోను చంద్రమౌళి, నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన గురుకులాలు, మినీ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేసేందుకు గురువారం ఐటిడిఎ మీటింగ్ హాల్లో టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్ల కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన సరుకులు మాత్రమే సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిసిసి డిఎం జి.సంధ్యారాణి, డిడి జి మంగవేణి, గురుకులం సెల్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ గంగస్వామి

రాయితీపై పాలిటెక్నికల్ పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక జిఎంఆర్ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులకు రాయితీపై టెస్ట్ పుస్తకాలు గురువారం అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డిఆర్‌ఎస్ గంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్లొమా మొదటి సంవత్సరం చదివిన విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నేరుగా కళాశాలకే పుస్తకాలు తెప్పించి 20శాతం రాయితీపై అందజేసినట్లు తెలిపారు. పేద విద్యార్థులు బయటి మార్కెట్లో పుస్తకాలు కొనుగోలు చేయడం కష్టమవుతుందని, నేరుగా ప్రభుత్వం నుండి పుస్తకాలు తెప్పించామని తెలిపారు. కార్యక్రమంలో విభాగ అధిపతులు పూర్ణాచారి, బోధకులు గిరీష్. భరత్ కుమార్, దేవుడు, భాస్కరరావు, వెంకట్రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ, రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయ పరిధిలో కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఎంపిటిసి సభ్యులు టి.పార్వతి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో సాయి కాలనీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందిస్తూ నిధులు మంజూరు చేశారని, వాటితో ఈ పనులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి.సత్యవతి, వెంకటరమణ కాంట్రాక్టర్ నాయుడు, కన్వీనర్ సిహెచ్ సురేష్, సిహెచ్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి సభ్యులు పార్వతి

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు తనిఖీ చేశారు. ఎంపిడిఒ కె.విజయలక్ష్మితో కలిసి ప్రతి కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించి ఎంతమంది గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలజంగి సుందరరావు, ఎంపిటిసి బోనెల మల్లిక, ప్రసాదరావు, పిహెచ్‌సి వైద్యాధికారులు డి.క్రాంతి కిరణ్మయి, శశిధర్, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ దుర్గాప్రసాద్, పంచాయతీ సెక్రటరీ ఎ.రామకృష్ణ, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం మండలంలోని చిదిమిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పుడు వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం వేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, సర్పంచులు ధమలపాటి ఉమామహేశ్వర రావు, ఎస్.లక్ష్మి సింహాచలం, ఎంపిడిఒ వై.వెంకటరమణ, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎ.మానస, ఎంఇఒ ఆనందరావు, వైసిపి నాయకులు పాలవలస ధవళేశ్వరరావు, వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొండ : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే వి.కళావతి, మండలి విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని బెజ్జిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మల భాను, వైస్ ఎంపిపి సూర్యప్రకాష్, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, సర్పంచులు సివ్వల శ్రీనివాసరావు, ఉపేంద్ర, కె.సూర్యనారాయణ, కొండలరావు తదితరులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిసీల పిహెచ్‌సి పరిధిలోని తాళ్లబురిడి లో జెఎఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ చూశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, వైద్యాధికారులు డాక్టర్ భాస్కరరావు, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిటిసి సభ్యులు మర్రాపు వాసుదేవరావు, వైస్ ఎంపిపిలు సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, నాయకులు బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కోటసీతారాంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు తనిఖీ చేశారు. ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఇంటింటి ఆరోగ్య సర్వే లో ఎంతమందికి టోకెన్లు అందజేశారని, శిబిరం వద్ద కొత్తగా ఎంత మందిని నమోదు చేశారని వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ముఖ్యంగా జెఎఎస్‌లో ఆరోగ్య తనిఖీల్లో కొత్తగా గుర్తించిన బిపి, మధుమేహం, రక్త హీనత గల కిశోర బాలికలు, కఫం పరీక్షల ద్వారా కొత్తగా నమోదైన క్షయ వ్యాధి గ్రస్తులు, కళ్ల తనిఖీలకు వచ్చినవారిలో కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంత మందిని గుర్తించారు, రిఫరల్ అవసరమైన వారిని పర్యవేక్షణ, కొత్తగా గుర్తించిన లెప్రసీ లక్షణాలు ఉన్నవారు, పిల్లల్లో పుట్టుక లోపాలు గుర్తించడం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పి హెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.రాధాకాంత్, డాక్టర్ ఉషారాణి, స్పెషలిస్ట్ వైద్యులు, పంచాయతీ సెక్రటరీ కామేశ్వరరావు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

బలిజిపేట : వైద్యశిబిరంలో రోగులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్


వీరఘట్టం : వైద్యశిబిరంలో మాట్లాడుతున్న విప్ విక్రాంత్

భామిని : బాలేరు పిహెచ్‌సి పరిధిలోని కొసలిలో వైద్యాధికారులు దీపిక రాణి, శివ కుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొసలి సర్పంచ్ మజ్జి మోహన్‌బాబు మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో నిపులులైన వైద్యులు చేత అందిస్తున్న వైద్య సేవలను అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 469 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం 11మందిని రిఫరల్ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అప్పారావు, ఆర్‌ఐ రాంబాబు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని రావుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్‌పి వైస్‌చైర్మన్ ఎం.బాపూజీనాయుడు సందర్శించారు. ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 550 ఒపిలు చూడడం జరిగిందని, వీరికి వివిధ రకాల మందులు ఇచ్చినట్టు వైద్యాధికారులు ఎ.ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపిపి ఉరిటి రామారావు, వైద్యాధికారులు డాక్టర్ కెకె సాగర్‌వర్మ, పలువురు వైద్యులు, ఎంపిడిఒ జి.పైడితల్లి, డిటి పిఎస్‌ఎల్ కుమార్, ఇఒపిఆర్‌డి గోపాలకృష్ణ, ఎఒ ఎన్.అర్జునరావు, పంచాయతీ సర్పంచ్ బి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధన .... యోగా శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల్లో క్రమశిక్షణ, విద్యాబోధనలో నిబద్ధత, చదువులో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. తద్వారా గిరిజన విద్యార్థులు బడి పట్ల భయం వీడి చదువు పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు మండలంలోని దిగువమండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు. ఇందుకు కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలక దేవానంద్, సహా ఉపాధ్యాయుడు జె.సుబ్బారావు ప్రత్యేక శ్రద్ధే. పాఠశాల ప్రారంభానికి గంట ముందే విద్యార్థులు ఆరోగ్య సూత్రాల్లో భాగంగా యోగా శిక్షణ అందిస్తున్నారు. సాయంత్రం వేళల్లో ఆటలు, పాటలు, నృత్యాలు చేయిస్తున్నారు. విద్యార్థి ఒక్క చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంచుతున్నారు. విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండాలని, రసాయన ఎరువుల్లేని కూరగాయలను, అరటి, మొక్కజొన్న పంటలు పండిస్తున్నారు. పండిన కూరగాయలను మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నారు. పాఠశాలకు వెనుక భాగాన ప్రహరీ లేకపోవడంతో సొంత నిధులతోనే కర్రలతో కంచె నిర్మించారు. ఇలా విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో డ్రాపౌట్ లేకుండా ఏడాదికి ఏడాది విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ పట్ల గ్రామస్తులు కూడా అభినందిస్తున్నారు.

ఆదర్శంగా దిగుమండ ప్రాథమిక పాఠశాల

పాఠశాల ఆవరణలో సాగుచేస్తున్న కూరగాయలు

వైయస్ఆర్ జలకళ జాడేది?

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట... అధికారంలోకి వచ్చినప్పుడు ఒక మాట ఇలా అయితే రైతులకు భరోసా ఏలా అని?ఇందులో భాగంగా ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా ప్రకటించిన వైయస్సార్ జలకళ ఏమైనట్లు అని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నవరత్నాల్లో భాగంగా రెండున్నర ఎకరాలపై కలిగిన ఐదు ఎకరాల్లోపు గల ప్రతి రైతు వ్యవసాయ బోరు పంపు సెట్లు ఇచ్చి అన్ని విధాలా ఆదుకుంటామని సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగేళ్లయినా ఒక్క బోరు కూడా పడలేదన్నారు. మండలంలో వ్యవసాయ బోర్ల కోసం 240మందికి పైగా రైతులు దరఖాస్తులు చేసుకోగా, ఇందులో 12 మంది రైతులు వరకు వైఎస్ఆర్ జలకళ ప్రారంభిస్తామని చెప్పి బోర్‌వెల్ యజమాని వద్దకు ఈ 12 దరఖాస్తులు పంపినట్టు తెలిపారు. తీరా ఒక్క బోరు కూడా తీయకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం జియ్యమ్మవలస మండలంలోని పరస్పాడులో మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణి ఒక బోరును ప్రారంభించి చేతులు దులుపుకున్నారు తప్ప నేటికీ నియోజకవర్గంలో ఎక్కడా బోర్లు తీయని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా వైయస్సార్ జలకల పథకం ఉన్నదా లేదా అన్న విషయం రైతులకు అధికారులు చెప్పాల్సిన ఉందని, కావున వెంటనే జలకళకు దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు బోరు, విద్యుత్తు కలెక్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, సత్యనారాయణ, మన్మధరావు పాల్గొన్నారు.

జలాశయంలోకి చేపపిల్లలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

మత్స్యకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - కురుపాం

మత్స్యకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. గురువారం మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో గల మంటికొండ జలాశయం వద్ద రూ.54 లక్షల ఫింగర్ జింగ్స్ సైజు చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం పెద్దగొత్తిలి సచివాలయం వద్ద జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల వద్దకే వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని, దీన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిటి రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

మండలంలోని మరిపల్లి నుండి నాగరగూడ వరకు 2.3 కిలోమీటర్ల రూ.కోటి 60 నిధులతో మంజూరైన బిటి రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. అనంతరం బియ్యాలవలస పంచాయితీ గుమ్మిడి గూడ బిటి రోడ్డు నుండి షేకుపాడు వరకు 550 మీటర్లు రూ.46 లక్షలతో మంజూరైన బిటి రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి. సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటీశ్వరరావు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మున్సిపాలిటీ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని నర్సిపురంలో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీ, మునిసిపల్ కార్పొరేషన్లలో ఉపాధ్యాయ జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని, జనవరి 2009 నుండి నేటి వరకు ఆ ఖాతాలకు జమ కావాల్సిన మొత్తాలు జమ చేయాలని, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు, చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు రావాల్సిన మొత్తాలు నేరుగా నగదు రూపంలో చెల్లించాలని కోరారు. పట్టణంలోని పాఠశాల సమస్యలు సేకరించారు. అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంకా జీతాలు చెల్లించని ఉపాధ్యాయులకు, సమగ్ర శిక్ష సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో మహేష్, అప్పలనాయుడు, జోగినాయుడు, ప్రమీలారాని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అక్రమాలపై దర్యాప్తు నిర్వహించాలి

ప్రజాశక్తి -పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల విషయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలని ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జగనన్న కాలనీ నిర్మాణాలకు సుమారు 5 ఎకరాల స్థలం ప్రభుత్వం కొనుగోలు చేసి ప్రతి లబ్ధిదారుడికి 1.5 సెంట్లు స్థలం చేయించిందన్నారు. అయితే స్థలాల మంజూరులో అర్హులకు మొండి చేయి చూపించి అనర్హులకు స్థలాలు కేటాయించారని అన్నారు. ఈ మేరకు విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని కోరారు

210 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలో ఇందిరా కాలనీ సొండి వినోద్ నాటు సారా ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి, 500 నాటు సారా ప్యాకెట్లు, 160 లీటర్ల నాటు సారా క్యాన్లు సీజ్ చేసి మొత్తం 210 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సొండి వినోద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. దాడుల్లో స్పెషల్ పార్టీ సిబ్బంది, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు విచారకరం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బాబుతో నేను అనే కార్యక్రమంలో భాగంగా ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కలిగొట్టు, జె.కలిగొట్టు, కొసగూడ, దోకులగూడ గ్రామాల్లో కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో చంద్రబాబు అక్రమ అరెస్టుపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాడి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిపోలూరు శ్రీనివాసరావు, యూనిట్ ఇంచార్జ్ చిన్న జయంత్, చిన్నారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని సోమగండిలో బాబుతో నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబునాయుడును అన్యాయంగా అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన విధానాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, సవర సోడంగి, వార్డు సభ్యులు జి.శ్రీరాములు, గొర్ల రాదయ్య, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

అంకవరంలో....

జియ్యమ్మవలస మండలం అంకవరంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ గ్రామంలో ఉన్న ప్రతి ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, టిడిపి అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అరుకు పార్లమెంటు కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యంనాయుడు, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, క్లస్టర్ 6 జోగి బుజింగరావు, మండల కో ఆర్డినేటర్ గుబ్బరు నరేశ్ ,ఎక్స్ సర్పంచ్ కరణం అప్పలనాయుడు, ఎంపిటిసి రాయిపిల్లి భారతి, మాజీ సర్పంచ్ పప్పల సత్యంనాయుడు పాల్గొన్నారు.

సాలూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే జరిగిందని నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి సంధ్యారాణి అన్నారు. పట్టణ నాయకులు, కార్యకర్తలతో కలిసి బంగారమ్మకాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్ డబ్బి కృష్ణ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్లను, సెక్యూరిటీ గార్డులను, సూపర్వైజర్లను పస్తులు పెట్టి చాకిరి చేయిస్తున్న కాంట్రాక్టర్లు వారికి బకాయిపడ్డ మూడు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని స్థానిక జిల్లా ఆసుపత్రిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఈ నిరసననుద్దేశించి ఎఐటియుసి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ రోగులకు ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా ఆసుపత్రులను శుభ్రం చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, దగ్గరుండి ప్రతి పనిని పరిశీలిస్తున్న సూపర్వైజర్లు, ఆసుపత్రి కంటికి రెప్పలా కాపాడుతున్న సెక్యూరిటీ గార్డులకు వేతనాలు చెల్లించకపోవం దారుణమన్నారు టివిటి గ్రూప్, స్కాట్ లేండ్ గ్రూప్ కాంట్రాక్టర్లు ఎవరి దన్ను కార్మికులకు జీతాలు చెల్లించకుండా పస్తులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించి, ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం జీతాలు ఇప్పించి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని మెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సుపర్వైజర్లు పాల్గొన్నారు..

వాహనదారులకు రోడ్ టాక్స్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి వాహనదారుడికి రోడ్డు ట్యాక్స్ తప్పనిసరి ఉండాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌కుమార్, సత్యనారాయణ అన్నారు. గురువారం కురుపాంలో వాహనాలు తనిఖీలు చేసి, రోడ్డు టాక్స్ లేని వాహనాలకు, పరిమితికి మించి అధిక లోడుతో వెళ్లిన వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రతిఒక్కరూ వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ తప్పని సరిగా కలిగి ఉండాలని, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ఆర్మీ ఉద్యోగాలకు 10 మంది ఎంపిక

బొబ్బిలి : ఆర్మీ ఉద్యోగాలకు వీర బొబ్బిలి క్రీడా మైదానంలో ఉచిత శిక్షణ పొందిన 10 మంది యువకులు ఎంపికయ్యారు. ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికైన యువకులను కోచ్ శ్రీనివాసరావు అభినందించారు. పట్టుదల, లక్ష్యం ఉంటే ఏదైనా సాధించవచ్చునని కోచ్ శ్రీనివాసరావు అన్నారు.

బాధితురాలికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

పారిశుధ్య కార్మికుడిని ఆదుకున్న ఆస్పత్రి సిబ్బంది

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డైలీ వేజ్ శానిటేషన్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి అనే మహిళకు ఆసుపత్రి సిబ్బంది ఉదారతతో రూ.23,700 ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఆస్పత్రిలో లక్ష్మి డైలీ వేజ్ శానిటరీ వర్కర్‌గా విధులు నిర్వహిస్తుందని, ఇటీవల కాలంలో తనకు కేన్సర్ అని తెలిసిందన్నారు. లక్ష్మీ ఆర్థిక పరిస్థితి బాగోలేనందున వైద్యులతో సహా తోటి సిబ్బంది కొంతమేరకు నగదును ఎత్తి ఆర్థిక సహాయాన్ని అందించామని అన్నారు. లక్ష్మి ప్రస్తుతం విశాఖపట్నం పినాకిల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నదని, ఆమె చికిత్సకు తాము ఇచ్చిన ఆర్థిక సహాయం కొంతమేరకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ శ్రీధర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

ప్రజాశక్తి -సీతంపేట

ఐటిడి పరిధిలో ఉన్న సీతంపేట, మెళియాపుట్టి, మందస ఎటిడబ్ల్యూఒ క్లస్టర్‌లో ఉన్న జిపిఎస్ ఉపాధ్యాయులకు సీతంపేట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం వృత్యంతర శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సులభ పద్ధతుల విద్యార్థులకు పాఠాలు బోధించాలని ఉన్నారు. ఇలాంటి శిక్షణల వల్ల ఉపాధ్యాయులకు కొత్త అంశాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఎఎంఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

రంగరాయపురంలో ఎంఐజి లేఅవుట్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ సమీపంలోని రంగరాయపురం వద్ద ఎంఐజి లేఅవుట్ ఏర్పాటు చేయనున్నట్లు జెసి మయూర్ అశోక్ తెలిపారు. గురువారం బొబ్బిలి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే లేఅవుట్ కోసం 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామన్నారు.